TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 119 | ఆదివారం, సెప్టెంబర్ 1, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## కాళేశ్వరం కమిషన్ గడువు

# మళ్లీ పొడిగింపు




హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్ విచారణ గడువును మరోసారి పొడగించింది. రెండు నెలలపాటు కమిషన్ విచారణ గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నీటి పారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా అక్టోబర్ 31 వ తేదీ వరకు విచారణ గడువును పొడిగిస్తూ శనివారం (ఆగస్టు 31న) జివో జారీ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన ఘటనపై రిటైర్డ్ చీఫ్ జస్టిస్ పిసి. ఘోష్ నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం విచారణ కమిషన్ వేసిన సంగతి తెలిసిందే. విచారణ కమిషన్ ఇప్పటికే నీటి పారుదల శాఖలో ముఖ్య అధికారులుగా పనిచేసిన వారిని విచారించింది. తాజా గడువు పొడిగించడంతో విచారణ పూర్తయిన తర్వాతే ప్రభుత్వానికి కమిషన్ నివేదిక ఇవ్వనుంది.

## న్యాయ వ్యవస్థపై...

# సంపూర్ణ విశ్వాసం



హైదరాబాద్: నా వ్యాఖ్యల ను కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించాయ ని, భారత న్యాయవ్యవస్థపై తనకు అత్యంత గౌరవం, పూర్తి విశ్వాసం ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యల పై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిన వి షయం తెలిసిందే. దీనిపై ట్విట్టర్ వేదికగా రే వంత్ రెడ్డి పలు ఆసక్తికర వ్యాఖ్య చేశారు. తన కు ఆపాదించబడిన వ్యాఖ్యలను 29 ఆగస్టు, 2024 నాటి కొన్ని పత్రికలు, న్యాయవ్యవస్థ విజ్ఞతను ప్రశ్నిస్తున్నానన్న అభిప్రాయాన్ని వె లిబుచ్చాయని ఆయన అన్నారు. అయితే తా ను న్యాయ ప్రక్రియను గట్టిగా విశ్వసిస్తానని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఆ పత్రికా నివేదికలో ప్రతిబింబించే ప్రకటనలపై తాను బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అటువంటి నివేదికల్లో తనకు ఆపాదించబడిన వ్యాఖ్యలు వక్రీకరించబడ్డాయని సిఎం రేవంత్ అన్నారు. న్యాయవ్యవస్థ దాని స్వతంత్రత పట్ల తనకు అత్యున్నత గౌరవం ఉందని, భారత రాజ్యాంగం దాని నీతిని దృఢంగా విశ్వసించే వ్యక్తిగా, న్యాయవ్యవస్థపై ఉన్న గౌరవాన్ని కొనసాగిస్తానని ఆయన తెలిపారు.

# కుల గణన నిర్విఘ్నంగా కొనసాగాలి: డాక్టర్ వకుళాభరణం




యాదాద్రి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ధమాషా మేరకు రిజర్వేషన్లు అమలు కావాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు నిర్దిష్ట ప్రణాళికలు అందజేశామని బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. శనివారం యాదాదీశ్వరుని కుటుంబ సమేతంగా వచ్చి దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో గడపడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కరరావు స్థానిక ఆర్డీఓ జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆయన దర్శన ఏర్పాట్లలో పాల్గొన్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు, అర్చక స్వాములు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేసి తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. అనంతరం ఆలయం వెలుపల వకుళాభరణం విలేకరులతో కాసేపు మాట్లాడారు. మూడేళ్ల పదవీకాలం ఎంతో ఆత్మ సంతృప్తిని ఇచ్చిందన్నారు. మూడేళ్ల పదవీ కాలంలో అంకిత భావంతో పనిచేయగలిగానని, పదవులు నిర్వహించడం తన జీవితంలో కొత్తవి కాదని, ఏ జాతుల హక్కుల కోసం కృషి చేశానో ఆ వర్గాలకు చెందిన బీసీ కమిషన్ చైర్మన్ గా పనిచేయడం తన జీవితంలో మధుర ఘట్టమని ఆయన తెలిపారు. కుల గణనకు ప్రశ్నావళి రూపొందించి ప్రభుత్వానికి ఇచ్చానని చెప్పారు. బలహీనవర్గాలు కులగణన నిర్వహించాలని చిరకాలంగా కోరుతున్నారని, అది ఎలాంటి అడ్డంకులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడానికి శక్తిని ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి మహత్తర ఘట్టంలో కులగణన చేపట్టాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించే అవకాశం రావడం, ఇంటింటి సర్వే నిమిత్తం ప్రశ్నావళి రూపొందించి ప్రభుత్వానికి అందజేసే కార్యాచరణలో భాగం అవడం జీవితంలో గొప్ప సంఘటనగా గుర్తుండి పోతుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తన పదవి కాలం ఈ రోజుతో ముగుస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి బాధ్యతలు అప్పగించినా అంకితభావంతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో బీసీలలోని సంచార విముక్తి జాతుల కులాలు ఇప్పటికీ ఆధునిక అభివృద్ధిని అందుకోలేకపోతున్నారని, కుల సర్వే పూర్తి అయ్యాక వచ్చిన సమగ్ర సమాచారంతో వారి జీవన ప్రమాణాల్లో మెరుగుదల తీసుకురావాల్సిన బాధ్యతను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో నిర్వర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో డెడికేటెడ్ కమిషన్ గా బీసీ రిజర్వేషన్లను నిర్ణయించడానికి విశేషంగా కృషి చేశానని, అయితే గడువు ముగియడం కారణంగా తుది నివేదిక ఇవ్వకుండానే నిష్క్రమించడం కొంత ఇబ్బంది కలిగిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఈ ప్రక్రియ విజయవంతంగా ముగియాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కోరుతున్న విధంగా ప్రజా ప్రాతినిధ్యం పెరగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## దళిత ఎమ్మెల్యే వేముల వీరేశానికి

# అవమానం



నల్లగొండ: నకిరేకల్ దళిత ఎమ్మెల్యే వేముల వీరేశంకు అవమానం జరిగింది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనలో ఎమ్మెల్యే వీరేశాన్ని పోలీసులు గుర్తుపట్టలేదు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికేందుకు పోలీసులు వీరేశాన్ని లోపలికి అనుమతి ఇవ్వలేదు. దీంతో వేముల వీరేశం అలిగి వెళ్లిపోయారు. అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోతుండగా అక్కడే ఉన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బుజ్జగించి వెనక్కి రమ్మని అడిగారు. కానీ తీవ్ర అసహనంతో అక్కడ నుంచి వీరేశం వెళ్లిపోయారు. పోలీసులకు కామన్ సెన్స్ ఉండదా అంటూ ఎంఎల్ఏ ఎవరు కాదా? అనేది తెల్వదా అంటూ మండిపడ్డారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెలికాప్టర్‌లో భువనగిరికి చేరుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హెలిపాడ్ వద్దకు వేర్వేరుగా వెళ్తుండగా, మెటల్ డిటెక్టర్ పాయింట్ వద్ద గుర్తించని పోలీసు అధికారులు వారిని అడ్డుకున్నారు. మంత్రులు భువనగిరి పర్యటనలో భాగంగా వారికి స్వాగతం పలికేందుకు వచ్చిన ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని పోలీసులు వేర్వేరుగా అడ్డుకున్నట్టు సమాచారం.

## ఏసీబీ వలలో

# ట్రాన్స్ కో డీఈ

హైదరాబాద్: స్టేషన్ ఘనపూర్ మండలకేంద్రంలోని కుంభం ఎల్లయ్య అనే రైతు తన వ్యవసాయ భూమిలోని 33 కేవీ విద్యుత్తు లైన్ మార్చడానికి డీఈ (డివిజనల్ ఇంజనీర్) హుస్సేన్ నాయక్ రూ. 20వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో రైతు ఎల్లయ్య కుమారుడు రాజు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో (శనివారం) స్థానిక డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్ కార్యాలయంలో రాజు నుంచి రూ. 20వేల లంచం తీసుకుంటుండగా.. అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ దాడిలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్స్పెక్టర్లు ఎస్. రాజు, ఎల్. రాజు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే 1064కు టోల్ ఫ్రీ కి సంప్రదించవచ్చని ఏసీబీ అధికారులు తెలిపారు.

## రాష్ట్రాన్ని బుల్డోజర్ రాజ్

# కానివ్వొద్దు



హైదరాబాద్: తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్ కానివ్వద్దని, ఈ మేరకు తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే కు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయాన్ని, చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదలకు గూడు లేకుండా చేసే ప్రయత్నాన్ని మీరు సమర్థిస్తున్నారా అని ప్రశ్నించారు. 'ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయలుగా మార్చటం అమానవీయం, అన్యాయం అంటూ గతంలో మీరే అన్నారు. ఇప్పుడు తెలంగాణలో కూడా పేదల ఇళ్లను అదే విధంగా కూల్చేస్తూ వారిని నిరాశ్రయులు చేస్తున్నారు. దీనికి మీ సమాధానం ఏమిటి? ' అంటూ మల్లిఖార్జున ఖర్గే ను కేటీఆర్ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని 75 మంది పేదల ఇళ్లను తెల్లవారుజామున 3 గంటలకు ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేసిన సంఘటనను ఆయన దృష్టికి ట్విట్టర్ ద్వారా తీసుకెళ్లారు. మీ ప్రభుత్వం కూల్చేసిన 75 కుటుంబాల ఇళ్లలో 25 కుటుంబాలు వికలాంగులకు చెందినవేనని అని ఆయనకు చెప్పారు. ఎలాంటి చట్టపరమైన ప్రక్రియను అనుసరించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించటమనేది చట్టపరంగా కరెక్ట్ కాదనీ, ఆధునిక సమాజంలో ఇలాంటి ఆటవిక వ్యవహారాలు ఏమాత్రం మంచివి కావన్నారు. 40 ఏళ్ల క్రితం, 20 ఏళ్ల క్రితం ఇళ్లు కట్టుకొని నివాసం ఉన్న పేదల ఇళ్లను ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేస్తుండటం ఎంత అవమానవీయమో ఖర్గే చెప్పాలన్నారు. తెలంగాణను మరో బుల్డోజర్ రాజ్ కాకుండా మీ పార్టీ ప్రభుత్వానికి సూచన చేయలంటూ ఖర్గే కు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# హైడ్రా దూకుడు....

## ఆరుగురు అధికారులపై కేసులు

హైదరాబాద్: హైడ్రా సిఫార్సుతో అధికారులపై సైబరాబాద్ సిపి కేసులు నమోదు చేశారు. చెరువుల్లో కట్టడాలకు అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై కేసులు నమోదు చేశామని పోలీసులు వెల్లడించారు. సైబరాబాద్ ఇఒడబ్ల్యు వింగ్‌లో సిపి అవినాష్ మహంతి కేసులు నమోదు చేశారు. నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, చందానగర్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సుదామ్ష, బాచుపల్లి ఎంఆర్ఒ పూల్ సింగ్, మేడ్చల్-మల్కాజ్‌గిరి ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, హెచ్ఎండిఎ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, హెచ్ఎండిఎ సిటీ ప్లానర్ రాజ్‌కుమార్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైడ్రా సిఫార్సు మేరకు ఎఫ్ టిఎల్ లో అనుమతులు ఇచ్చిన ఆరుగురు అధికారులపై కేసులు నమోదు చేశామని పోలీసులు వివరించారు.



# రాష్ట్రంలోడెకాయిట్ల పాలన : జగదీష్ రెడ్డి



**నల్గొండ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనడం చేతకాని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేడు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై పడి ఏడుస్తున్నారని ధ్వజమెత్తారు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి.. డబ్బులతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన వారు మీవాళ్లయితే, కేసీఆర్ పదేళ్ల ప్రజాసంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి అన్నారు. నేడు ఆయన నల్గొండలో మీడియాతో మాట్లాడుతూ, ఉత్తమ్ కుమార్ రెడ్డి తన భాషను మార్చుకుంటే మంచిదని హితవు పలికారు. మీకంటే వెనుక వచ్చినవాడు మీకంటే చిన్నవాడు ముఖ్యమంత్రి పదవి గుంజుకుంటే చూస్తూ ఊరుకున్న చేతకాని దద్దమ్మగా ఉత్తమ్ ఉన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే రేవంత్‌కు పడ్డ చివాట్లు మీకు తప్పవని ఉత్తమ్‌ను హెచ్చరించారు. ఆయన ఇలాగే తిడుతుంటే చీవాట్లు పడతాయని, కానీ ఆయన ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేరన్నారు. రాష్ట్రంలో డెకాయిట్ల పాలన సాగుతోందని విమర్శించారు. తెలంగాణలో ఎక్కడకు వెళ్లినా అధికార పార్టీ వారి కమీషన్లు, దోపిడీ గురించే ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. తమ హయాంలో రైతులకు ఇబ్బందులు లేకుండా నీటిని, విద్యుత్‌ను అందించామన్నారు. కానీ ఇప్పుడు నీటి కోసం, విద్యుత్ కోసం ధర్నాలు జరుగుతున్నాయన్నారు. సాగునీటి కోసం ధర్నాలు కొనసాగితే యాసంగి నాటికి కాంగ్రెస్ నాయకులు ప్రజల్లో తిరగలేరని హెచ్చరించారు. ఇరిగేషన్ మంత్రిగా ఉత్తమ్ విఫలమయ్యారని వ్యాఖ్యానించారు. బాధ్యతలు చేతకాకుంటే మంత్రి పదవిపై ఆయన పునరాలోచన చేయాలన్నారు.


## యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటుపై.. ఎంపీ చామల హర్షం



యాదాద్రి : తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయడం హర్షనీయమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ... యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయడంపై భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ అనుసరించిన తరహాలోనే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ద్వారా స్వయం ప్రతిపత్తి, విధి విధానాలు ఉండేలా అవసరమైతే చట్ట సవరణ చేయడం ద్వారా యాదగిరిగుట్ట ఆలయం అభివృద్ధి జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించి ఆలయ అభివృద్ధికి కృషి చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

# రామగుండంలో రూ. 8 వేల కోట్లతో విద్యుత్ ప్లాంట్

## : ఉప ముఖ్యమంత్రి భట్టి




**పెద్దపల్లి:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లపాటు దుర్మార్గపు ప్రభుత్వం రాజ్యమేలిందన్నారు. గత డిసెంబర్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఇందిరమ్మ రాజ్యం నిర్మించే దిశగా పనిచేస్తున్నామన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా రామగుండంలో ఎనిమిది వేల కోట్ల రూపాయలతో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన కేంద్రాన్ని త్వరలో మంజూరు చేస్తామన్నారు. 24 గంటల పాటు విద్యుత్ ఉత్పాదన జరిపి రాబోయే 10 ఏళ్లలో తెలంగాణను సర్ప్లస్ పవర్ రాష్ట్రంగా తీర్చిదిద్ది ఇతర రాష్ట్రాలకు విద్యుత్తును అమ్మే విధంగా తయారు చేస్తామన్నారు.

ఎన్నికల హామీలు భాగంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి వారి టికెట్ల కోసం ఇప్పటికే ఆర్టీసీకి 2500 కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తున్నామన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీని 10 లక్షల రూపాయలకు పెంచామని, రాష్ట్రంలో నాలుగు లక్షల 50వేల డబుల్ బెడ్ రూమ్ గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందని ప్రతి నియోజకవర్గంలో 3500 డబుల్ బెడ్రూం లు నిర్మించి అర్హులైన నిరుపేదలకు అందిస్తామన్నారు.

గత టిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పాలించిన లక్ష రూపాయల రుణమాఫీ రైతులకు చేయలేకపోయిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే రెండు లక్షల రుణమాఫీ చేసి చూపామన్నారు. ఇప్పటికే 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ కోసం ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేసిందన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఎవరైనా రైతులకు రుణమాఫీ జరగకపోతే సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలియజేస్తే వెంటనే రుణమాఫీ చేస్తామన్నారు. ప్రతి ఏడాది మహిళలకు 20వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు, ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందిస్తామన్నారు.

గత ప్రభుత్వం రెసిడెన్షియల్ కళాశాలలకు గత ఏడాది మూడు కోట్ల రూపాయలను మాత్రమే వెచ్చించిందని, తమ ప్రభుత్వం ఈ ఏడాది కోసం ఐదు వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుంటే పదేళ్లపాటు ప్రజలను మోసగించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తిరిగి ప్రజల్లోకి వస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉచిత ప్రయాణం వద్దని ప్రజలకు చెబుతారా లేదా రెండు లక్షల రుణమాఫీ వద్దని చెబుతారా అని ప్రశ్నించారు. బహిరంగ సభలో మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు మక్కాన్సింగ్, వినోద్, వివేక్, ప్రేమ్సాగర్ రావు, విజయ రమణారావు, లక్ష్మణ్ కుమార్ తోపాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోండి...


# నిర్వాహకులతో బండి సంజయ్



ఉమ్మడి కరీంనగర్ : రాబోయే వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. నవరాత్రి ఉత్సవాల్లో అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, అధికారుల సమన్వయ సమావేశాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ%ౌ% కరీంనగర్ గణేష్ ఉత్సవాల్లో ఎటువంటి ఘటనలూ జరిగిన చరిత్ర లేదని, నిర్వాహకులు ఆ ఆనవాయితీని కొనసాగించాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన వీడియోలను, ఫోటోలను ట్రోల్ చేయవద్దని సూచించారు. నవరాత్రి ఉత్సవాలకు కావలసిన అన్నిరకాల ఏర్పాట్లను సమయానికి ముందే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఏర్పాట్ల విషయంలో ప్రైవేట్ వ్యక్తులు సంస్థల సహాయం కూడా తీసుకోవాలని అన్నారు. కరీంనగర్ లోని గణేష్ మండపాలకు అవసరమైన విద్యుత్ బిల్లును తాను చెల్లిస్తానని పేర్కొన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని, మండపాల్లో నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని కోరారు. సంస్కృతిని పండుగను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... పోటీగా కాకుండా భక్తితో భగవంతున్ని పూజించాలని కోరారు. మట్టి గణపతిలను ప్రతిష్టించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. ఉత్సవాలకు కావలసిన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. గ్రీన్ గణేశా విగ్రహలను ప్రోత్సహించాలన్నారు. పీఓపీ విగ్రహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని, ప్రజల్లో అవగాహన కల్పించి, చైతన్యం తేవాలన్నారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి నిర్వాహకులు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. రోడ్డుకు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం ఉపయోగించకూడదన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. నిమజ్జనానికి సంబంధించిన రూటు మ్యాప్‌ను ముందే తెలియజేయాలన్నారు. ఊరేగింపుల్లో బాణసంచా ఉపయోగించరాదని, డీజే శబ్దాలు, అశ్లీల డ్యాన్సులు నిరోధించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకూడదన్నారు. పోలీస్ శాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పేయి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా పోలీస్ అధికారులు వినాయక చవితి ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

# సెప్టెంబర్ 4న కశ్మీరుకు రాహుల్



న్యూఢిల్లీ: నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల కోసం ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సెప్టెంబర్ 4న జమ్మూ, కశ్మీరులో రెండు ఎన్నికల ర్యాలీలలో ప్రసంగించనున్నారు. రాహుల్ గాంధీ ప్రచారంలో పాల్గొనాలని కూటమి అభ్యర్థులతోపాటు జమ్మూ కశ్మీరు ప్రజలు కూడా కోరుకుంటున్నారని ఏఐసిసి ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మీర్ శనివారం విలేకరులకు తెలిపారు. దక్షిణ కశ్మీరు జిల్లాలోని దూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీర్ దూరు స్టేడియంలో రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తారని ఆయన చెప్పారు. ' జమ్మూలోని సంగల్‌దన్‌లో మరో ర్యాలీలో ఆయన ప్రసంగిస్తారని మీర్ తెలిపారు. తమ ఆహ్వానాన్ని రాహుల్ గాంధీ అంగీకరించినందుకు ఆనందిస్తున్నా మని, ఇది మొదటి దశ మాత్రమేనని, ఇతర దశలలో కూడా రాహుల్ జమ్మూ కశ్మీరును సందర్శించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతోసహా దాదాపు 40 మంది స్టార్ క్యాంపేనర్లు జమ్మూ కశ్మీరు అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రచారం చేయనున్నట్లు మీర్ తెలిపారు.

# ఆ ఆడపిల్లలో కన్నీళ్లు కనిపించడం లేదా?

## రేవంత్ ను నిలదీసిన హరీశ్ రావు

హైదరాబాద్ : ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తుంటే ఈ ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? అని నిలదీశారు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు . ఆడపిల్లలు రెండు కిలోమీటర్లు నడిచి జాతీయ రహదారి మీద ధర్నా చేస్తే ఈ ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు స్పందన లేదని మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాలోని పాలమాకుల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు నేడు సందర్శించారు.



ఈ సందర్భంగా అక్కడి విద్యార్థినులు తమ గోడును వినిపించుకున్నారు%ౌ% దానిపై హరీశ్ మాట్లాడుతూ, పిల్లల బాధ తెలుసుకోవాలని ఇక్కడికి వచ్చాం. పిల్లల కళ్లలో నీళ్లు కారిపోతున్నాయి. దుఃఖాన్ని ఆపులేకపోతున్నారు. భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే విపరీతంగా కర్రలు విరిగిపోయేలా కొడుతున్నారని ఏడుస్తున్నారు. పిల్లల పరిస్థితి చూస్తుంటే మా కళ్లల్లో కూడా నీళ్లు ఆగలేదు. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెబితే, వాటిని తీసేసి తినండిని టీచర్లు చెబుతున్నారని పిల్లలు చెప్పారు. పాఠాలు సరిగా చెప్పడం లేదు. మంచి భోజనం లేదు. కనీస సౌకర్యాలు కూడా లేవని పిల్లలు బాధపడుతున్నారు. ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చారని ఆరో తరగతి పిల్లలు చెబుతున్నారు. బుక్స్ కూడా ఇవ్వలేదు. బట్టలు రావు.. పుస్తకాలు రావు.. కడుపు నిండా భోజనం పెట్టే పరిస్థితి లేదు. గతంలో కేసీఆర్ సన్నబియ్యంతో భోజనం పెడితే.. ఇవాళ గొడ్డుకారంతో భోజనం పెడుతున్నారు. ప్రతి రోజు కోడిగడ్డు ఇవ్వాలని ఉంది. వారానికి రెండుసార్లు ఇస్తున్నారు. ఆ కోడిగుడ్లు వాసన వస్తున్నాయని, వాటిని తినకలేకపోతున్నామని పిల్లలు బాధపడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ మాటలు కోటలు దాటుతాయి.. చేతల్లో మాత్రం శూన్యం అంటూ మండిపడ్డారు . రేవంత్ రెడ్డి యూ ఆర్ ఏ ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్.. నువ్వు పూర్తిగా విఫలం అయిపోయావు అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ, , సోషల్ వెల్ఫేర్ కూడా రేవంత్ దగ్గరే ఉందని అంటూ, మీ శాఖలోనే ఈ రకంగా జరుగుతున్నాయంటే నువ్వు ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్ అని ధ్వజమెత్తారు. .

హాస్టల్ విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్ ఛార్జిలు అందడం లేదు. మెస్ బిల్లులు విడుదల చేయడం లేదు. పిల్లలకు పురుగులతో కూడిన అన్నం పెడుతున్నారు. నీవు పూర్తిగా విఫలం అయ్యావు. మాటలు కాదు.. యాక్షన్‌లో చేసి చూపించు. పిల్లల గురించి ఆలోచించు అని హరీశ్‌రావు సూచించారు. ఈ ప్రభుత్వంలో కస్తూర్బా విద్యాలయాలతో పాటు ఇతర గురుకులాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. విషాహారం తిని పిల్లలు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇప్పటి వరకు 500 మంది దాకా ఆస్పత్రి పాలయ్యారు. 38 మంది చనిపోయారు. ఒక వైపు పాము కాట్లు, మరో వైపు ఎలుకలు కొరుకుతున్నాయి. అయినా ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది. రామాయంపేట ఎస్సీ గురకులంలో 11 మంది, నల్లగొండ బీసీ గురుకులంలో 13 మంది విద్యార్థులను ఎలుకలు కొరకడంతో వారు ఆస్పత్రి పాలయ్యారు. ఒకప్పుడు తెలంగాణ గురుకులాలు దేశానికి ఆదర్శంగా ఉండేవి. ఇవాళ తల్లిదండ్రులు కూడా కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కులం పేరుతో దూషిస్తున్నారని పిల్లలు చెబుతున్నారు. ఇప్పటికైనా రివ్యూ చేయండి.. టీచర్లందరిని మార్చండి. నాణ్యమైన భోజనం పెట్టండని రాష్ట్ర ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.

## 'ఎక్స్'పై నిషేధం



అమెరికా వ్యాపారవేత్త, ఎక్స్ (ట్విట్టర్) అధినేత ఎలాన్ మస్క్‌కు బ్రెజిల్ సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. కోర్టు బ్రెజిల్‌లో ఎక్స్‌పై నిషేధం విధించింది. స్థానికంగా తమ దేశంలో ఒక ప్రతినిధిని నియమించేందుకు మస్క్ నిరాకరించడంతో ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కోర్టు తెలియజేసింది. నిషేధపు ఉత్తర్వులను ఉల్లంఘించి విపిఎన్ ద్వారా ఎక్స్‌ను ఉపయోగిస్తే జరిమానా విధిస్తామని కోర్టు పదే పదే హెచ్చరించింది. దాదాపు నాలుగు కోట్ల జనాభా ఉన్న బ్రెజిల్‌లో 80 లక్షల మంది ఎక్స్‌ను ఉపయోగిస్తున్నారు. నెలకు ఒక సారైనా ఎక్స్‌లో పోస్ట్‌లు పెట్టడం, కామెంట్లు పెట్టడం వంటివి చేస్తుంటారని ఒక సర్వే వెల్లడించింది.

తెలంగాణ క్యాపిటల్

## సంపాదకీయం

ఆదివారం, సెప్టెంబర్ 1, 2024

## విద్యావిధానం ఇలా ఉంటే..

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే ఉన్నత చదువులు చదువుకున్న నేను గత రెండు దశాబ్దాలుగా వివిధ ప్రయివేటు విద్యాసంస్థల్లో గణిత ఉపాధ్యాయుడిగా, భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా, అప్పుల తాకిడితో విపరీతమైన ఆర్థిక సమస్యలను చూసిన విద్యాసంస్థల నిర్వాహకుల్లో ఒకడిగా ఉంటున్నాను. అన్నింటికీ మించి విద్యారంగ ప్రేమికుడిగా నాకు విద్యతో విడదీయరాని సంబంధం, విడదీయలేని అనుబంధం వుంది. పాఠాలు బోధించిన అనుభవంతో నేటి విద్యావ్యవస్థలోని మార్పులపై నేను కొన్ని నా ఆలోచనలను బాధ్యతతో మీకు విన్నవిస్తున్నాను. ఈ రోజు విద్య కొంతమంది స్వార్థం, కొన్ని రాజకీయ కారణాల వల్ల వ్యాపారంగా తన రూపు మార్చుకోవడం ప్రారంభమైంది. ఐఐటీ, నీట్ వంటివి అసామాన్యమైన ప్రతిభ గల గ్రామీణ, తాలుకా స్థాయి పేద విద్యార్థులకు సైతం అందని ద్రాక్ష అయ్యింది. అందుకే పేద ధనిక సామాజిక సాంస్కృతిక సాంఘిక లింగ కుల మతం వంటి తదితర అంతరాలు లేకుండా అందరికీ సమానంగా "అంతర్జాతీయ స్థాయి విద్య"అందాలి. చదువు "కొనడం" పూర్తిగా మాయమై చదువుకునే అవకాశాలు గల్లీ నుంచి ఢిల్లీ దాకా అందరికీ సమానంగా ఉండాలి. అంతరిక్ష ప్రయోగాల కాలంలో మనం రాణించాలంటే మీరన్నట్లు ప్రపంచంతో పోటీపడాల్సిందే. ప్రైమరీ, హైస్కూల్, ఇంటర్ స్థాయి సిలబస్‌లు ఒకదానికొకటి సంబంధం ఉండాలి. సబ్జెక్ట్ నిపుణుల సాయంతో రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల కనుగుణంగా నూతన సిలబస్, బోధనా పద్ధతులును రూపొందించాలి. మనం అక్కడక్కడ వెలుగులోకి వస్తున్న ఫేక్ సర్టిఫికెట్‌లు కొనుక్కునే స్థాయి కాకుండా వంద ఏళ్ల చరిత్ర కలిగిన మన విశ్వ విద్యాలయాల్లో పి.హెచ్ డి, ఎం.ఎస్సీ, బి.ఎడ్ వంటి తదితర చదువులు చదివి నెట్, సెట్, టెట్ వంటి అర్హత పరీక్షల్లో పాసై, విద్యారంగం, బోధనపై ఆసక్తి వుండి కొన్ని కారణాల వల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉద్యోగం పొందని వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి విద్యాసంస్థలు నెలకొల్పేలా ప్రోత్సహించాలి. కేజీ నుంచి పీజీ వరకు బోధన, బోధనేతర ఖాళీలను ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ సాయంతో భర్తీ చేయాలి. బడ్జెట్‌లో విద్యకు 15% నిధులు కేటాయించాలి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేస్తూ ఐఐటీ నీట్ ఫౌండేషన్ విద్యను కూడా ఒత్తిడి లేకుండా అందించగలిగితే విద్యను వ్యాపారం చేస్తున్న వ్యవస్థలను మనం నిర్మూలించవచ్చు. ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయ, అధ్యాపక పిల్లలు ప్రభుత్వ స్కూల్లో, కళాశాలల్లో చదివిస్తే ఆ తల్లిదండ్రులను గుర్తించి, వారి గురించి ఆదర్శప్రాయంగా మీడియాలో రాస్తున్నారంటే మన ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యావ్యవస్థపై లోతుగా విశ్లేషించాల్సిన అవసరం వుంది. ఆర్థికంగా లేని వాళ్లే ప్రభుత్వ బడిబాట అనే విధానంలో కచ్చితంగా మార్పు రావాలి. విద్య మనందరి ప్రాథమిక హక్కు. శారీరక, మానసిక దృఢత్వం కోసం ఆటలకు ప్రత్యేక సమయం కేటాయించాలి. మీరు తెలంగాణ క్రీడాకారులను ఒలింపిక్స్ పథకాలు తెచ్చేలా ప్రోత్సాహం అందిస్తామన్న తీరును స్వాగతిస్తున్నాం. దానికి పాఠశాలలే పునాది కావాలి. సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మీరు అందించిన ఆర్థికసాయం అభినందించదగినది. దానివల్ల భవిష్యత్‌లో మన రాష్ట్రం నుంచి సివిల్స్‌కు పోటీపడే అభ్యర్థుల సంఖ్య పెరుగుతుంది. విశ్వవిద్యాలయాల స్థాయిలో పరిశోధనలు పెరిగేలా రిసెర్చ్ స్కాలర్స్‌కు కూడా స్కాలర్‌షిప్ అందించాలి. రసాయనాల కోసం ఆర్థిక సాయం అందించాలి. ఇంజనీరింగ్, మెడికల్ విద్యా వ్యవస్థలో నూతనత్వం కోసం నిపుణుల సలహాలు తీసుకోవాలి. మన పిల్లలకు నాణ్యతతో కూడిన, ఆందోళన లేని పరిసరాలతో స్నేహం చేసే శాస్త్రీయ విద్యను మనం అందించాలి. వివిధ రంగాల ప్రజల నుంచి, వివిధ రకాల విద్యాసదస్సులు, చర్చల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి విభిన్న ఆలోచనల సారాంశాన్ని సేకరించి ఓ మంచి విద్యావిధానంతో మన పిల్లలకు గొప్ప గొప్ప కలల భవిష్యత్తును నిజం చేయాలి.

# ఈ లైంగికదాడి వెనుక అదృశ్య హస్తాలెన్నో!




డాక్టర్ రథ్ గోవిందా కర్(ఆర్.జి.కర్) కలకత్తా హాస్పిటల్లో ఆగస్టు 9న ట్రైనీ డాక్టర్‌ను రేప్ చేసి, క్రూరాతి క్రూరంగా హత్య చేసిన సంఘటన దేశ ప్రజలను కలవరపెడుతోంది. ఈ మెడికల్ కాలేజీని 1886లో స్థాపించారు. ఆసియా ఖండంలోని మొట్టమొదటి వైద్యాలయంగా పేరుగాంచినది. ఇంతటి పేరు ప్రఖ్యాతులు గడించిన ఆసుపత్రిలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం అత్యంత విచారకరం. ఈ ఘటన జరిగాక, ఈ కేసుకు సంబంధించిన ఆధారాలను అదృశ్యం చేయడానికి వేల మంది టీఎంసీ కార్యకర్తలు హాస్పిటల్‌పై దాడి చేయడం, సీసీ కెమెరాలను ఆఫ్ చేయడం, ఈ సంఘటన జరిగిన సమయంలో ప్రిన్సిపల్‌గా ఉన్న సందీప్ కుమార్ ఘోష్‌ను ఆ స్థానం నుండి తొలగించి, ఉన్నత స్థానంలో పునర్ నియామకం చేయడం అంతుపట్టని విషయాలు. పైగా సాక్ష్యాలను తారుమారు చేయాలని రాష్ట్ర పోలీసు యంత్రాంగం ప్రయత్నించడం, ఇది ఆత్మహత్యగా చిత్రీకరించడం అత్యంత వివాదాస్పదంగా మారింది. ఈ ఉదంతంపై వాస్తవాలు వెలికి తీయాలని, దోషులను గుర్తించాలని వైద్యరంగంలో ఉన్న సిబ్బంది, అనేక సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగడంతో ఈ ఉదంతాన్ని సీబీఐకి అప్పజెప్పడం, భారత సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి, విచారణ చేపట్టడంతో ఈ ఉదంతానికి అత్యంత ప్రాధాన్యత వచ్చినదనడంలో అతిశయోక్తి లేదు. ఈ కేసును నీరుగార్చడానికి మమతా బెనర్జీ ప్రభుత్వం 5 మంది మహిళా న్యాయవాదులను, ఎనిమిది మంది మగ న్యాయవాదులను, దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడిన దోషుల తరపున వాదించడంలో పేరు ప్రఖ్యాతులు గడించిన మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్‌ను తన ప్రభుత్వం తరపున నియమించుకోవడం దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక ప్రభుత్వం ఉన్నందువలన ఈ ఉదంతాన్ని సున్నితమైనదిగా కొందరు మలుస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇటువంటి సంఘటనలు జరగలేదా? అంటూ కొందరు స్వయం ప్రకటిత మేధావులు మీడియాలో రాస్తున్నారు. తప్పు ఏ ప్రభుత్వ హయాంలో జరిగింది అనేది కాదు ముఖ్యం, తప్పు చేసిన దోషులు ఎలాంటి వారైనా శిక్షించబడాలనేది ముఖ్యమైన విషయమని వీరు గ్రహిస్తే సమాజానికి కాస్తో, కూస్తో మేలు జరుగుతుంది. దొంగే - దొంగ, దొంగ అని అరచినట్లు ప్రభుత్వాన్ని నడిపే మమతా బెనర్జీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ జరగడం అత్యంత విచారకరం. శోచనీయం. ఈ ఉదంతంతో




సంబంధం ఉన్న వినయ్ రాయ్‌ని పోలీసులు అరెస్టు చేసి, సీబీఐకి అప్పజెప్పడం, సీబీఐ కోర్టు అనుమతితో పాలీగ్రాఫ్ టెస్టులు నిర్వహించడం జరిగింది. తాను నిర్దోషినని, తనను అనవసరంగా ఈ కేసులో ఇరికించారని జడ్జి ముందు వాపోవడం వాస్తవాలను దాచే విధంగా ఉంది. లైంగికదాడి చేసి క్రూరాతిక్రూరంగా,అమానుషంగా హత్య చేయడం వెనుక చనిపోయిన ట్రైనింగ్ డాక్టర్‌కూ, ఈ ఉదంతంలో ఇన్వాల్వ్ అయిన దోషులకూ మధ్య ప్రపంచానికి తెలియని విషయం ఏదో ఉంది. ఈ ఉదంతంలో పాలీగ్రాఫ్ టెస్టులకు గురైన ప్రిన్సిపల్ సందీప్ కుమార్ ఘోష్‌కి శరీర అవయవాలను అమ్మి సొమ్ము చేసుకునే అక్రమ వ్యాపారంతో సంబంధం ఉందని, ఆ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ కలకత్తా హైకోర్టుకు ఫిర్యాదు చేయడం తో ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. ఈ ఉదంతాన్ని సాకుగా చూపి, రాష్ట్రంలో గందరగోళాలు సృష్టించి, రాష్ట్రపతి పరిపాలన విధించి, రాజకీయ లబ్ధి పొందాలని కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతుందని మోడీ ప్రభుత్వ వ్యతిరేకులు కొందరు ఊహాగానాలు చేయడం జరుగుతోంది. ఈ కేసును రాద్ధాంతం చేసి, రాజకీయ లబ్ధిని పొందాలనుకుంటే అది జరగదు. ఇలాంటి 'కెపాసిటీ' బీజేపీ నాయకత్వానికి లేదు. కానీ కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉంటే తన కార్యకర్తలను ఎలా కాపాడుకోవాలో, కార్యకర్తలపై దాడులు చేసిన వారికి ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసు. కాంగ్రెసేతర ప్రభుత్వాలను కూల్చి, రాష్ట్రపతి పరిపాలన విధించి, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకోవడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలిసినట్లు ఇంకెవరికీ తెలియదు. మన దేశం న్యాయవ్యవస్థపై, విచారణ సంస్థలపై ప్రజలకు నమ్మకం పూర్తిగా సన్నగిల్లింది. అందుకు కారణం లేకపోలేదు. దేశభద్రతతో ముడిపడిన విషయాలను సైతం మన దేశాన్ని న్యాయవ్యవస్థ, విచారణ సంస్థలు త్వరగా నిగ్గు తేల్చి దోషులను శిక్షించిన దాఖలాలు లేవు. ఈ కేసు విషయంలోనైనా న్యాయవ్యవస్థ, దర్యాప్తు సంస్థలు త్వరిత గతిలో విచారించి, దోషులను తేల్చాలని ప్రజల ఆకాంక్ష!

# గిరిజన విశ్వవిద్యాలయ ప్రకటన ఏమైంది?

కేంద్ర ప్రభుత్వం 2014లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎ.ఐ.ఐ.ఎం.ఎస్), కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం అనే జాతీయ విద్యా సంస్థలను ఒకేసారి ఆంధ్ర ప్రదేశ్‌కు మంజూరు చేసింది. కానీ రూ. 834 కోట్లు ఎస్టిమేషన్ కలిగిన గిరిజన విశ్వవిద్యాలయం ఎక్కడ నిర్మించాలి అన్న దానిపై ఇంకా చర్చ కొనసాగుతోంది. యూనివర్సిటీకి నిధుల కేటాయింపులు కూడా ప్రతి ఏడాది తగ్గుతున్నాయి. 2015లో రూ. 834 కోట్లు కేటాయించి మొదటి విడత కింద రూ. 420 కోట్లు విడుదల చేసింది. 2023 సంవత్సరంలో సవరించిన బడ్జెట్‌లో రూ.40.67 కోట్లు కేటాయించారు. కానీ ఖర్చు జరగలేదు. ఈ ఏడాది ఏకంగా బడ్జెట్‌లో యూనివర్సిటీకి ప్రత్యేకించి ఎటువంటి కేటాయింపులు జరగలేదు. యుజిసి నిధుల నుండి కేటాయిస్తామని చెబుతుంది. పోనీ ఆ యుజిసి నిధులేమైనా పెంచారా అంటే అదీ లేదు. గతంలో యుజిసికి రూ. 6409 కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం 60.99 శాతం కోత విధించి కేవలం రూ.2500 కోట్లు కేటాయించారు. ఇందులో గిరిజన విశ్వవిద్యాలయంకు ఎంత ఖర్చు చేస్తారో వేచి చూడాలి. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విజయనగరంలో కొత్తవలస సమీపంలోని రెల్లి గ్రామంలో నిర్మించాలని గతంలో టిడిపి ప్రభుత్వం నిర్ణయించింది. 2015లో అక్కడ రైతుల నుండి 520 ఎకరాలు భూమిని సేకరించింది. కానీ దానికి రైతులకు ఎటువంటి పరిహారం చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులలో రూ. 5 కోట్లు ఖర్చు చేసి భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి చేతులు దులుపుకుంది. 'రెల్లిలో సేకరించిన భూమిలో ఎక్కువ శాతం జిరాయితీ భూమి. పరిహారం ఎక్కువ ఇవ్వాల్సి వుంటుంది. అందుకనే రెల్లి నుండి యూనివర్శిటీని మెంటాడలోని కుంఠినివలస దగ్గరకు మార్చామ'ని 2019లో నూతనంగా వచ్చిన వై.ఎస్.ఆర్.సి.పి ప్రభుత్వం చెప్పింది. అక్కడ రైతుల దగ్గర నుండి 563 ఎకరాలు భూమి సేకరించి నష్టపరిహారం కూడా 90 శాతం చెల్లించింది. 4 సంవత్సరాలు పాటు కాలయాపన చేసి ఎన్నికలు వస్తున్నాయనగా హడావుడిగా కేంద్రమంత్రి ధర్మేందర్ ప్రధాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత మళ్లీ ప్రభుత్వం మారింది. 2024లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. ఎస్.కోట ఎంఎల్ఏ కోళ్ల లలిత కుమారి యూనివర్సిటీ నిర్మాణం గతంలో అనుకున్న రెల్లిలోనే ఏర్పాటు చేస్తామని దానికి ముఖ్యమంత్రి, విద్యా శాఖమంత్రి కూడా ఆమోదం తెలిపారని ప్రకటించారు. ఈ మధ్య గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుంఠినివలసలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ యూనివర్సిటీ రెల్లిలో ఏర్పాటు చేస్తారని చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని ఇక్కడే ఏర్పాటు చేస్తామని, అందులో ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. అంతకు ముందు రోజే జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో యూనివర్శిటీ పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. నీటి సరఫరాకు 4 కోట్లు, విద్యుత్ సరఫరాకు రూ.3.6 కోట్లు, రోడ్డుకు పరిహారం చెల్లించడానికి రూ.2.6 కోట్లు అవసరమౌతాయని తెలిపారు. యూనివర్శిటీ మంజూరైనప్పటి నుండి ఇటువంటి ప్రకటనలు అనేకం వస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పని మాత్రం ముందుకు కదలడం లేదు. 2019 నుండి యూనివర్సిటీ ఏ.యు భవనంలో తాత్కాలికంగా తరగతులు నడుస్తున్నాయి. సుమారు 250కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. మన రాష్ట్రంతో పాటు కేరళ, కర్ణాటక, ఒడిస్సా వంటి ఇతర రాష్ట్రాల నుండి కూడా విద్యార్థులు ఇక్కడకు వచ్చి చదువుతున్నారు. వీరికి సరిపడా సదుపాయాలు లేవు. వసతి సదుపాయం లేక దగ్గరలో ఓ ప్రైవేట్ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నారు. అక్కడ రూ. 60,000 వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. అంతంత ఫీజులు కట్టుకోలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది విద్యార్థులు వసతి లేకపోవడంతో బయట ప్రైవేట్ హాస్టళ్లు, అద్దె గదుల్లో ఉంటూ చదువుతున్నారు. తరగతి గదులు సరిపోక పోవడంతో ఉదయం కొన్ని కోర్సులు, మధ్యాహ్నం కొన్ని కోర్సులు నడుస్తున్నాయి. కంటైనర్లతో నిర్మాణం చేసిన గదుల్లో ల్యాబ్ ఏర్పాటు చేయాల్సిని దుస్థితి. యూనివర్సిటీల్లో చేరుతున్న వారి సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుంది. వారందరికీ ఈ అరకొర సదుపాయాలు సరిపోవడం లేదు. విభజన చట్టం ప్రకారం 2021 నాటికి యూనివర్శిటీ నిర్మాణం పూర్తి కావాలి. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప పనుల్లో మాత్రం ఎటువంటి మెరుగుదల లేదు. గిరిజన యూనివర్శిటీ నిర్మాణం పూర్తయితే గిరిజన ప్రాంతంతో పాటు విజయనగరం జిల్లా కూడా అభివృద్ధి చెందుతుంది. ఆర్థికంగా వెనుకబడిన జిల్లాకు ఎంతో కొంత ఆర్థిక వనరులను సమకూర్చుకోగలదు. వేల మంది విద్యార్థులు చదువుకోవడానికి ఉపయోగ పడుతుంది. చాలా మందికి ఈ జిల్లాలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కాబట్టి ఇప్పటికైనా పాలకులు ఉత్తుత్తి ప్రకటనలు ఆపి నిర్మాణ పనిలో మెరుగుదల కనబరచాలి.

# అప్పటికీ, ఇప్పటికీ ఏం మారినట్లు?

దేశం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సన్నద్ధం అవుతున్న వేళ సరిగ్గా ఒక్కరోజు ముందు నడిరేయిన కలకత్తా ఆర్.జి కర్ మెడికల్ కళాశాల, ప్రభుత్వ హాస్పిటల్‌లో ద్వితీయ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ పల్మనాలజీ విభాగంలో వైద్య విద్యను అభ్యసిస్తున్న 31 ఏండ్ల వైద్య విద్యార్థినిపై దారుణమైన లైంగిక దాడి చేసి హత్య చేశారు. అత్యంత అమానవీయమైన ఈ హత్యాచారాన్ని నిరసిస్తూ, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని, గంటల తరబడి డ్యూటీ చేస్తున్న మహిళా డాక్టర్లకు కనీస విశ్రాంతి కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు కావాలని దేశవ్యాప్తంగా డాక్టర్లు, ప్రజలు నిరసన కార్యక్రమాలు చేశారు. కోల్‌కతాలో అర్ధరాత్రి మహిళలు రోడ్డెక్కిన తీరు 1970లో మహిళలపై లైంగిక వేధింపులు, లింగ వివక్షతకు నిరసనగా లింగ సమానత్వం కోసం సాగిన మహిళా ఉద్యమాలను గుర్తు చేశాయి. 12 సంవత్సరాల క్రితం దేశ రాజధాని ఢిల్లీలో అర్ధరాత్రి ఆడపిల్లపై జరిగిన అఘాయిత్యంతో దేశ ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. న్యాయంకై దేశం నలుమూలలా సాగిన ఆందోళనలు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. కలకత్తాలోని జాదవ్ పుర వీధుల్లో ఈ ఘటనపై నిరసన తెలుపుతున్న ఓ స్త్రీవాది తన టీ- షర్ట్‌పై అప్పటి నుండి ఇప్పటికీ ఏం మారింది? అని ఆంగ్ల భాషలో రాసి ఉన్న అక్షరాలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. వాస్తవానికి ఢిల్లీ నిర్భయ ఘటన నుండి నేటి కలకత్తా ఘటన వరకు మహిళల సంరక్షణలో ప్రభుత్వాలు ఏం ప్రగతిని సాధించాయి? అందరిలో తలెత్తే సాధారణ ప్రశ్న ఏంటంటే అసలు ఈ దేశంలో మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, వారి పట్ల కనీస పట్టింపు ఎక్కడుంది? ఆగస్టు 9న విరామం లేకుండా సుమారుగా 36 గంటల పాటు డ్యూటీ చేసిన వైద్య విద్యార్థిని, రాత్రి 2 గంటల ప్రాంతంలో విశ్రాంతి తీసుకునేందుకు సెమినార్ హాల్‌కి వెళ్లింది. గంటల తరబడి పనిచేసే అనేక విభాగాల డాక్టర్లకు విశ్రాంతి తీసుకునేందుకు రెస్ట్ రూములు లేవని పలువురు డాక్టర్లు ఆయా సందర్భాలలో వెల్లడించారు. దీని కారణంగా విశ్రాంతి కోసం పేషంట్ బెడ్‌పై లేదా వెయిటింగ్ హాల్స్‌లలో లేదా ఖాళీ గదుల్లో పడుకోవడం తప్ప జూనియర్ డాక్టర్లకు వేరే మార్గం లేదు. ఆ రాత్రి చనిపోయిన వైద్య విద్యార్థిని తమ కుటుంబీకులతో ఎప్పటిలాగానే ఆ రోజూ మాట్లాడింది. కానీ ఒక్క రోజులోనే తన కలల సౌధం కుప్పకూలింది. తల్లిదండ్రులు తన భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఆగస్టు 9 నుండి వైద్య విద్య శిక్షణ పొందుతున్న ప్రతీ డాక్టర్ బాధితురాలికి న్యాయం చేయాలంటూ, ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని కోరుతూ తమ సేవలను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పిస్తామని భరోసానిచ్చిప్పటికీ వైద్యులు తమ సేవలకు ముందుకు రాలేదు. బెంగాల్ రాష్ట్రంలో సుమారుగా 2 లక్షల మంది రోగులు రోజువారీగా ఓపీ తీసుకుంటారు, 12 వేల మందికి పైగా అడ్మిట్ అవుతుంటారు. రాధా గోవిందా కార్ ఆసుపత్రిలో 1600 బెడ్స్ ఉన్నాయి. రోజూ 3600 మంది రోగులు ఓపీ తీసుకుంటుంటారు, 245 మంది రోజూ అడ్మిట్ అవుతుంటారు. వైద్య సేవల అంతరాయం ఏర్పడిన అసౌకర్యంతో రాష్ట్రంలో అనేక చోట్ల సాధారణ ప్రజలూ నిరసన తెలుపుతున్న డాక్టర్లతో చేతులు కలిపి రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలపై గొంతెత్తుతున్నారు.


# సూర్యతో శ్రియా స్పెషల్ సాంగ్



హీరోయిన్ శ్రియాకు ఐటెంసాంగ్స్ కొత్త కాదు. ఒకప్పుడు ఆమె ఐటమ్ క్వీన్‌గా ఓ వెలుగు వెలిగింది. చాలా ఐటమ్ సాంగ్స్‌తో పాపులర్ అయింది. ఈమధ్య కాలంలో అలాంటి పాటలకు ఆమె గ్యాప్ ఇచ్చింది. నిజానికి ఆమె గ్యాప్ ఇవ్వలేదు, మేకర్స్ ఆమెను తీసుకోవడం తగ్గించేశారు. అందం ఉన్నప్పటికీ, ఆకర్షణ చెక్కుచెదరనప్పటికీ శ్రియాకు అవకాశాలు తగ్గాయి. అది సహజం. ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ లాంగ్ గ్యాప్ తర్వాత ఓ స్పెషల్ సాంగ్ ఆఫర్ దక్కించుకుంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో సూర్య ఓ సినిమా చేస్తున్నాడు. ఇందులో శ్రియాను తీసుకున్నారు. ఆమెపై కొన్ని సన్నివేశాలున్నాయి. దాంతోపాటు స్పెషల్ సాంగ్ కూడా ఉంది. తాజాగా జరిగిన ఊటీ షెడ్యూల్‌లో శ్రియాపై సన్నివేశాల చిత్రీకరణ పూర్తిచేశారు. త్వరలోనే చెన్నై శివార్లలో వేసే భారీ సెట్‌లో సూర్య, -శ్రియాపై ఓ స్పెషల్ సాంగ్ తీయబోతున్నారు. ఈ సినిమాకు సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నాడు. మున్నా, దేవదాసు, బాస్, తులసి, పులి లాంటి ఎన్నో సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది శ్రియా. తెలుగు, తమిళ్, హిందీ భాషలతో కలుపుకుంటే ఆమె చేసిన స్పెషల్ సాంగ్స్ లిస్ట్ చాలా పెద్దది. మళ్లీ ఇన్నేళ్లకు ఆమె సూర్య సినిమాలో స్పెషల్ సాంగ్ చేస్తోంది.

# ప్రగ్యను చూస్తే కంచె దాటాల్సిందే...

కంచె బ్యూటీ ప్రగ్య జైశ్వాల్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పని లేదు. చాలా కాలంగా స్టార్ డమ్ కోసం ఈ బ్యూటీ చేయని ప్రయత్నం లేదు. నందమూరి బాలకృష్ణ సహా పలువురు యువహీరోల సరసన తెలుగులో అవకాశాలు అందుకున్న ప్రగ్య అటుపై బాలీవుడ్ లో సల్మాన్ భాయ్ సినిమాలోను నటించింది కెరీర్ పరంగా అంతగా మైలేజ్ ని ఇవ్వలేదు. అయినా పట్టువదలని ఈ బ్యూటీ ఇప్పటికీ తన ప్రయత్నాలను విరమించలేదు. మరోవైపు సోషల్ మీడియాల్లో ఆర్జన కోసం ప్రగ్య నిరంతరం ఫోటోషూట్లు, వీడియోలను షేర్ చేస్తోంది. సామాజిక మాధ్యమాల్లో అభిమానులకు నేరుగా టచ్ లో ఉంటోంది. తాజాగా ప్రగ్య షేర్ చేసిన ఓ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. ఈ కొత్త లుక్ యూత్ లోకి వేగంగా దూసుకెళుతోంది. ప్రగ్య హాఫ్ వైట్ చీరలో ఎంతో అందంగా ఒద్దికగా కనిపిస్తోంది. కాంబినేషన్ గా హాఫ్ షోల్డర్ వైట్ బ్లౌజ్ ని ధరించి, నాభి దిగువగా చీర కుచ్చిళ్లను దోపిన వైనం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆన్ లొకేషన్ నుంచి ఈ స్పెషల్ ఫోటోషూట్ ని ప్రగ్య షేర్ చేసిందని ఫోటోలు చూస్తే అర్థమవుతోంది. అయితే ప్రగ్య వైట్ అండ్ స్వీట్ లుక్ చూశాక నెటిజనులు రకరకాలుగా కామెంట్ చేస్తున్నారు.




# కంగనాకు 'ఎమర్జెన్సీ' కష్టాలు..

బాలీవుడ్ నటి కంగనా రనౌత్ నటించిన ఎమర్జెన్సీ రిలీజ్ వేళ కొన్ని రాష్ట్రాల్లో నిషేధ అంశం తెరపైకి వస్తోన్న సంగతి తెలిసిందే. రిలీజ్ పై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే న్యాయ నిపుణుల సలహా తీసుకుంటుంది. మరోవైపు శిరోమణి అకాలీదళ్ దిల్లీ పార్టీ నిలిపివేయాలంటూ సీబీఎఫ్ సీని ఆశ్రయించింది. ఇంకోవైఉ సిక్కు సంఘాలు రిలీజ్ పై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కొంత మంది దుండగులు ఏకంగా కంగనని అత్యాచా రం చేసి చంపేస్తామంటూ బెదిరిపు లేఖలు సైతం రిలీజ్ చేసారు. అయినా కంగన ఎక్కడా వెనక్కి తగ్గలేదు. నా సినిమా రిలీజ్ ని ఎవరాపుతారో? చూస్తానంటూ మరో సంచలన ప్రకటన రిలీజ్ చేసింది. అత్యవసర పరిస్థితిని ఎక్కడా వక్రీకరించకుండా ఉన్నది? ఉన్నట్లే చూపించామని, ఎవర్నీ కించ పరచడం గానీ, ఎలాంటి సున్నిత అంశాలు టచ్ చేయలేదంటూ పేర్కొంది. ఈ విషయంలో కంగన ఒంటరి పోరాటమే చేస్తోంది. బాలీవుడ్ పరిశ్రమ నుంచి ఎలాంటి మద్దతు ఎమర్జెన్సీ చిత్రానికి గానూ, కంగనకు గానీ వ్యక్తిగతంగా దక్కలేదు. ఈ విషయంలో కంగన సైతం ఎంతో బాధపడింది. అయితే ఇండస్ట్రీ స్పందిచకపోవడానికి ఇక్కడ పెద్దగా కారణాన్ని హైలైట్ చేయాల్సిన పనిలేదు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీ కి వచ్చి సక్సెస్ అయిన నటి కంగన. తన ముక్కు సూటి ధోరణితో పరిశ్రమకి వ్యతిరేకంగా ఎన్నోసార్లు..ఎన్నో అంశాలపై మాట్లాడింది. బాలీవుడ్ కాస్టింగ్ కౌచ్ అంశం అవ్వొచ్చు..స్టార్ హీరోలతో రిలేషన్ షిప్ చెడిన సందర్భంలో కంగన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారమే రేపాయి. ఈ విషయంలో కంగనని ఏ ఒక్కరూ ఆపలేకపోయారు. తాను చెప్పాలనుకున్నది సూటిగా మీడియా ముందుకొచ్చి నిర్భయంగా మాట్లాడిన సందర్భాలెన్నో. అగ్ర నిర్మాణ సంస్థలపై ఎన్నో కామెంట్లు చేసింది. హీరోలతో సమాన పారితోషికాలు మాకెందుకు ఇవ్వరని హీరోయిన్లు అందరి తరుపున గొంతెత్తిన సందర్భాలెన్నో. దర్శక, రచయితల తీరుపైనా తనదైన బాణీని ఎన్నోసార్లు వినిపించింది. ఇప్పుడవన్నీ కలిసి వెరసి కంగనపై మౌనంగా ప్రతీకార్య చర్యకు దిగినట్లు కనిపిస్తుంది. సాధారణంగా సినిమా నిషేధం అన్న అంశం తెరపైకి వచ్చినప్పుడు కొంతమందైనా స్పందిస్తారు. కానీ ఎమర్జెన్సీ విషయంలో మాత్రం ఆ సినిమాలో నటించిన మిగతా నటులు సైతం సైలెంట్ గానే ఉన్నారు. ఈ సినిమాకి కర్త, కర్మ, క్రియ అన్నీ కంగనే. నటి, నిర్మాత, దర్శకత్వం అన్ని బాధ్యతలు ఒంటి చేత్తో అన్నీ తానై మోసింది.




## మత్తు వదలరా 2 సినిమా విజువల్స్ అద్భుతం: రాజమౌళి



'మత్తు వదలరా' సినిమాకు సీక్వెన్స్‌గా 'మత్తు వదలరా 2'ను తెరకెక్కించారు. ఈ సినిమాలో శ్రీసింహ, రితేశ్ రానా నటించారు. మత్తు వదలరా 2 సినిమా టీజర్ లాంచ్ చేశారు. దర్శక ధీరుడు రాజమౌళి ఈ సీక్వెల్ టీజర్‌పై స్పందించారు. మత్తు వదలరా 2 మా బాయ్స్ వస్తున్నారని, టీజర్‌లో డైలాగ్స్ సూపర్‌తో పాటు ఫన్నీగా ఉన్నాయని ప్రశంసించారు. విజువల్స్ అద్భుతంగా ఉండడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయన్నారు. సెప్టెంబర్ 13న టికెట్లను తస్కరించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ టీచర్‌లో మరో డైలాగ్‌ను హీ... హీ... హీ... హీ టీమ్ అంటూ స్మైలీ ఎమోజీలను పోస్టు చేశారు. రాజమౌళి తన ట్విట్టర్‌లో చేసిన పోస్టు వైరల్‌గా మారింది. సెప్టెంబర్ 13న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వెండితెరకు వేధింపుల చెద

మలయాళ సినీ పరిశ్రమను కుదిపేస్తున్న మీటూ ఉద్యమం ఇప్పుడు దక్షిణాదిలోని ఇతర చిత్ర పరిశ్రమలలో కూడా ప్రకంపనలు సృష్టిస్తోంది. మహిళా నటులపై లైంగిక వేధింపులకు సంబంధించి జస్టిస్ హేమ కమిటీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక వెలుగుచూసిన దరిమిలా పలువురు మహిళా నటులు చేసిన ఆరోపణలను పరుస్కరించుకుని ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, నటులపై పోలీసు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ప్రముఖ బహుభాషా నటి, బిజెపి నాయకురాలు రాధికా శరత్ కుమార్ ఒక ప్రైవేట్ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన విషయాలు బయటపెట్టారు. షూటింగ్ సెట్స్ వద్ద నటుల కోసం ఉంచే కారవాన్‌లలో రహస్య కెమెరాలు అమర్చి మహిళా నటులు దుస్తులు మార్చుకుంటున్న దృశ్యాలను చిత్రీకరిస్తున్నారంటూ రాధిక వెల్లడించారు. ఒక షూటింగ్ సందర్భంగా ఈ విషయం తనకు తెలిసిందని ఆమె చెప్పారు.

తాను కారవాన్‌లో దుస్తులు మార్చుకుని సెట్స్‌లోకి వెళుతుండగా కొందరు వ్యక్తులు సెల్‌ఫోన్‌లో ఏదో చూస్తూ నవ్వుకోవడం కనిపించిందని, వాళ్లేం చూస్తున్నారని ఒక స్పాట్ బాయ్‌ని అడిగితే కారవాన్‌లో మహిళా నటుల డ్రెస్ చేంజ్ వీడియోను చూస్తున్నారని అతను చెప్పాడని ఆమె తెలిపారు. తాను వెంటనే చిత్ర నిర్మాత, దర్శకుడిని గట్టిగా హెచ్చరించానని, ఆతర్వా నుంచి కారవాన్‌లోకి వెళ్లాలంటేనే ఇబ్బందిగా అనిపించేదని, డ్రెస్ చేంజ్ చేసుకోవడానికి తన హోటల్ రూముకు వెళ్లేదాన్నని రాధిక వివరించారు. తమ హోటల్ రూము తలుపును రాత్రి పూట ఎలా తట్టేవారో కొందరు మలయాళ నటీమణులు తన దృష్టికి తెచ్చారని, కొందరైతే తన సహాయాన్ని కూడా కోరారని రాధిక తెలిపారు. కారాన్‌లో దుస్తులు మార్చుకునే నటీమణుల వీడియోలను కొందరు తమ సెల్ ఫోన్లలో సెపరేట్ ఫోల్డర్లలో ఆ నటీమణులు పేర్లతో సేవ్ చేసుకుంటున్నట్లు కూడా ఆమె వెల్లడించారు. ఇదిలా ఉండగా..తమిళ చిత్ర పరిశ్రమలో ఇటువంటి అనుభవాలు ఏ నటికైనా ఎదురైతే బయటపెట్టాలని సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశాల్ పిలుపునిచ్చారు. దీనిపై స్పందించిన జాతీయ అవార్డు గ్రహీత, నటి కుట్టి పద్మిని తాను పదేళ్ల వయసులో తమిళ చిత్ర పరిశ్రమలో ప్రవేశించినపుడు తనపై లైంగిక దాడి జరిగిందని, దీనిపై తన తల్లి నిలదీయగా తమ ఇద్దరినీ సెట్ నుంచి బయటకు తరిమేశారని తెలిపారు. కాగా..మలయాళ చిత్ర పరిశ్రమలో మీటూ ఉద్యమం పుంజుకోవడంతో ప్రముఖ నటుటు ముకేష్ (సిపిఎం ఎమ్మెల్యే), సిద్దిఖ్, జయసూర్య, సుధీశ్, ఎడవెల బాబు, మనియన్‌పిల్ల రాజుపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా.. ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్‌పై మరో కేసు నమోదైంది. తనపై లైంగిక దాడి జరిగినట్లు తాజాగా ఒక యువనటుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు రంజిత్‌పై రెండవ కేసు నమోదు చేశారు. ఆడిషన్ పేరిట రంజిత్ 2012లో తనను బెంగళూరులోని ఒక హోటల్‌కు పిలిపించి తన చేత బలవంతంగా దుస్తులు తీయించి దాడి చేశాడని ఆ యువ నటుడు ఆరోపించారు. ఇదంతా ఆడిషన్ ప్రక్రియలో భాగమని చెప్పాడని, మరుసటి రోజు రంజిత్ తనకు డబ్బు కూడా ఇవ్వచూపాడని ఆ నటుడు ఆరోపించారు. దీంతో కోచ్చి పోలీసులు రంజిత్‌పై రెండవ కేసు నమోదు చేశారు. అంతకుముందు ఒక బెంగాలీ నటి చేసిన ఫిర్యాదుపై కేరళ పోలీసులు రంజిత్‌పై కేసు నమోదు చేశారు.




**పరిశ్రమను నాశనం చేయొద్దు: మోహన్‌లాల్**

జస్టిస్ హేమ కమిటీ నివేదిక దరిమిలా పలువురు నటుటు, దర్శక నిర్మాతలపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మలయాళం మూవీ ఆర్టిస్టస్ అసోసియేషన్(అమ్మ) అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన ప్రముఖ నటుడు మోహన్‌లాల్ మొదటిసారి శనివారం మౌనం వీడారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మలయాళ చిత్ర పరిశ్రమను నాశనం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. హేమ కమిటీ నివేదికను తాము స్వాగతిస్తున్నామని, కమిటీ నివేదికను బయటపెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైనదని ఆయన అన్నారు. అన్ని ప్రశ్నలకు అమ్మ సమాధానం చెప్పలేదని, ఈ ప్రశ్నలు అందరి నుంచి రావలసి ఉంటుందని ఆయన అన్నారు. అందరూ కష్టపడి పనిచేసే పరిశ్రమలో అందరినీ నిందించలేమని, దర్యాప్తు కొనసాగుతున్నందున బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉండాల్సిందేనని ఆయన చెప్పారు. తాను మలయాళ చిత్ర పరిశ్రమలోని ఏ అధికార వర్గానికి చెందిన వాడిని కానని, ఈ రంగంలో అలాంటి వర్గం ఉందని కూడా తనకు తెలియదని ఆయన చెప్పారు. ఎవరైనా తప్పు చేసినట్లు రుజువైతే వారిని కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. మేమ కమిటీ నివేదికను తాను ఇంకా చదవలేదని ఆయన స్పష్టం చేశారు.